అన్నదానానికి రూ.50,116 విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గుంటూరు పట్టణానికి చెందిన ఎ వెంకటేశ్వరరావు, గాయత్రి దంపతులు రూ.50,116లు విరాళమిచ్చారు. ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా విరాళాన్ని అందజేశారు. అదేవిధంగా గుంటూరు విద్యానగర్‌కు చెందిన యలమంచి వెంకటమోహన్, లక్ష్మీకుమారి దంపతులు రూ.10,116 అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

లడ్డూ ప్రసాదాల తయారీ తనిఖీ



లడ్డూ నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో లడ్డూ ప్రసాదాల తయారీని ఆదివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తనిఖీ చేశారు. లడ్డూ నాణ్యతను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాదాలు భక్తులకు అందుబాటులో ఉంచాలని, నాణ్యతలో రాజీ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్, ఈఈ రమ, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎంపీడీఓ బి.ఎం విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ప్రజలు ఆయా సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని, ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తామని వివరించారు.

223 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న కామినేని హాస్పిటల్ వైద్యసిబ్బంది

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయంలో కామినేని హాస్పిటల్, శంకర్‌కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఈఓ హరిగోపినాథ్ ప్రారంభించారు. వైద్యసిబ్బంది 223 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పవన్‌కుమార్, షణ్ముఖబాబు, మధురిక తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాకు ప్రహరీ నిర్మించాలని వినతి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలోని బలుసుపాడు రోడ్‌లో ముస్లింలు ప్రార్థనలు చేసుకునే చారిత్రక ఈద్గాకు రెండువైపుల గోడ నిర్మించాలని పలువురు ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే తాతయ్యను ఆదివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఆగస్టులో సంభవించిన వరదలకు ఈద్గా గోడలు కూలిపోయినందున, పునర్నిర్మించాలని కోరారు.

రవాణా రంగంలో లారీడ్రైవర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న నందిగామ రూరల్ సీఐ చవాన్

వీరులపాడు: రవాణా రంగంలో లారీ డ్రైవర్స్ పాత్ర కీలకమైనదని నందిగామ రూరల్ సీఐ చవాన్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో ఆదివారం మండల స్థాయి కార్మికుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి, నిద్ర మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సోమేశ్వరరావు మాట్లాడుతూ చలానాల పేరుతో కార్మికులను ఇబ్బంది పెట్టటం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డ్రైవర్లపై వేధింపులు అధికమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని ప్రతి ఒక్క కార్మికుడు, డ్రైవర్ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గౌస్, సహదేవరావు, కాజా, మహేష్ పాల్గొన్నారు.

విజయ గణపతికి విశేష పూజలు



కంచికచర్ల :స్థానిక ఇందిరా కాలనీలో కొలువై ఉన్న విజయ గణపతిస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కాకాని పవన్ కుమార్‌శర్మ స్వామి వారికి మహన్యాస పూర్వక, నీరాజన మంత్రపుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు. విఘ్నేశ్వరుడికి పూజా నవగ్రహ ఆరాధన, గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాలవ వాసుదేవరావు, భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 చిట్టిబాబు

జగ్గయ్యపేట: సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ద్వారా సోమవారం నుంచి నిర్వహించే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నందిగామ ఇన్‌చార్జ్ డీవైఈవో సాంబశివరావు తెలిపారు.ఇందుకోసం జగ్గయ్యపేట పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 423మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలను ఎంఈఓ-2 చిట్టిబాబు ఆదివారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై సిబ్బంది తగు సూచనలు ఇచ్చారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో యన్నాకుల రాంబాబు షాపు వద్ద శ్రీవాసవి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ పంపిణీ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం ప్రారంభించారు. వాసవీసేవా సమితి సభ్యులను అభినందించారు. అనంతరం బాటసారులకు మజ్జిగను పంపిణీ చేశారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘననివాళి

జగ్గయ్యపేటఅర్బన్: ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆత్మ బలిదానం చేసిన మహోన్నత త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తన్నీరు మాట్లాడుతూ తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు అందరికీ ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, పట్టణ యూత్ ప్రధానకార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఎండీ.ఇమ్రాన్‌పాషా, బీసీ సెల్ అధ్యక్షుడు గుంజ ఆశీర్వాదం, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహరెడ్డి, మన్నె అప్పారావు, నాయకులు భాణావత్ రాజు, మారిశెట్టి అనిల్, షేక్ ఖాదర్ పాల్గొన్నారు.

కూటమి పార్టీల ఆధ్వర్యంలో..

టీడీపీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. జమ్మిచెట్టు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర సాధన కోసం తన ప్రాణాన్ని తృణపాయంగా వదిలిన పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కౌన్సిలర్లు గొట్టె నాగరాజు, వెంకట్, ఇర్రి నరసింహారావు పాల్గొన్నారు. అదేవిధంగా జమ్మిచెట్టు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఆపార్టీ నేతలతో కలిసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, ఆర్యవైశ్య సంఘాల నాయకులు చారుగుండ్ల కొండ, కొత్తా పురుషోత్తం, నాయకులు జీవీడీ.ప్రసాద్, బుజ్జి, బ్రహ్మం, గుడ్ల రామారావు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరువలేనిదని పలు స్వచ్ఛందసంస్థల నాయకులు కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహించారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరజీవి ప్రాణత్యాగం వలనే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం సాధ్యమైందని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా సంస్థల నాయకులు చవట నాగేశ్వరరావు, పబ్బతి సీతారామగుప్త, మహంకాళి చంద్రశేఖర్, మారం అమరయ్య, కేతేపల్లి శ్రీనివాసరావు, వడ్డెల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అన్నపూర్ణా సేవాసమితి అధ్యక్షుడు పారేపల్లి సాయిబాబు ఆధ్వర్యంలో స్థానిక గాంధీసెంటరులో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పేటలో పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో..

నందిగామరూరల్: ఆంధ్ర రాష్ట్రానికి అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అనితరమైనదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అమరజీవి జయంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మునగంటి కామేశ్వరరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఊటుకూరు సత్యనారాయణ, పులిపాటి లక్ష్మణరావు, ఆంజనేయులు, కొత్త సాంబశివరావు, చిట్టెం వెంకట నారాయణ, ముక్కపాటి నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: స్థానిక పెద్దబజార్‌లో ఆర్యవైశ్య సంఘ నాయకులు పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించినవారిలో ఆర్యవైశ్య సంఘ నాయకులు జల్లా శ్రీనివాసరావు, పెరుమాళ్ల యశ్వంత్, జూలూరి విశ్వనాథం తదితరులు ఉన్నారు.



పేటలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, నాయకులు



నందిగామ గాంధీసెంటరులో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల నాయకులు



నందిగామలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కంచికచర్లలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నేటి నుంచి 'పది' పరీక్షలు



నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని సోమవారం నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలకు నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో 6,164 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఇన్‌చార్జ్ డీవైఈవో సాంబశివరావు ఆదివారం తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాల్లో ఏర్పాటు చేసిన 25 పరీక్షా కేంద్రాలలో 3,575 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని 15 పరీక్షా కేంద్రాలలో 2,589 మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు..

నందిగామ డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 40 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, వెలుతురు, మరుగుదొడ్లుతోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు వివరించారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు వెంట తీసుకురాకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: పదో తరగతి పరీక్షల కోసం పెనుగంచిప్రోలు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో డి. రవీంద్ర ఆదివారం తెలిపారు.పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్, శ్రీచైతన్య స్కూల్‌లో జరిగే ఈ పరీక్షలకు మండలం నుంచి మొత్తం 466 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వివరించారు.

కరుణించే కల్పవల్లి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ

నేడు అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమల కార్యక్రమం

పెనుగంచిప్రోలు: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు ఈనెల 14 నుంచి అంగరంగవైభవంగా సాగుతున్నాయి. చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టం అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి పసుపు-కుంకుమ బండ్లు ఈనెల 17వతేదీ సోమవారం ఆలయం వద్దకు రానున్నాయి. అనిగండ్లపాడులోని అమ్మవారి పుట్టింటి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి వద్ద నుంచి విద్యుద్దీపకాంతులతో, భక్తుల జయజమ ధ్వానాల మధ్య పెనుగంచిప్రోలు ఆలయం వరకు బండ్లు రానున్నాయి. పసుపు-కుంకుమలను తిలకించేందుకు భక్తులు రోడ్డుకు ఇరువైపులా నిల్చుండటంతో నాలుగు కిలోమీటర్ల మేర భక్తుల రద్దీ ఉంటుంది. ఈసందర్భంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



శ్రీతిరుపతమ్మవారి ఆలయం



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

తిరుపతమ్మ ఆలయ స్థల పురాణం...

17వ శతాబ్దంలో పవిత్ర మునేటి తీరాన కొల్లా శివరామయ్య, రంగమాంబ దంపతులకు ఏడుకొండలవాడి వర ప్రసాదంగా తిరుపతమ్మ జన్మించింది. పెనుగంచిప్రోలులోని కాకాని కృష్ణయ్య, వెంగమాంబ దంపతుల కుమారుడు గోపయ్యను వివాహం చేసుకున్న తిరుపతమ్మ రాకతో ఆప్రాంతమంతా సుభిక్షంగా వర్ధిల్లుతుండగా ..అనుకోకుండా ఒకనాడు ఎండలు పెరిగి..పాడిపంటలు కరువై..కరువు విలయ తాండవం చేస్తుంది. దీంతో పశుగ్రాసం కోసం గోపయ్య గోవులను తోలుకొని అడవికి వెళ్తాడు. ఈసమయంలో అత్త, తోటికోడలు అరళ్లకు తోడు భయంకరమైన కుష్ఠువ్యాధితో బాధపడుతున్న తిరుపతమ్మను పశువుల పాకకు గెంటి వేస్తారు. పశువుల శాలలో దీనస్థితిలో ఉన్న ఆమెకు పాపమాంబ అనే ముదిరాజ్ కులానికి చెందిన సేవకురాలు సేవలు చేస్తుంది. అడవికి వెళ్లిన గోపయ్య పులి దాడిలో మరణించాడని తెలుసుకున్న తిరుపతమ్మ తన అవతార సమాప్తిని గ్రహించి గ్రామాధికారులు, ప్రజలకు తన మహిమలను తెలుపుతుంది. భర్తతోపాటు సహగమనం చేస్తుంది. ఆతరువాత కాలంలో అదేప్రాంతంలో గోపయ్య సమేత తిరుపతమ్మ విగ్రహాలతోపాటు, కుంకుమ భరిణ దొరికాయని, ఆప్రాంతంలోనే ఆలయం నిర్మించారని స్థలపురాణం చెబుతోంది. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి, పాల్గుణ పౌర్ణమికి రెండు సార్లు ఐదు రోజులపాటు తిరునాళ్ల నిర్వహిస్తారు. కుష్ఠు రోగిగా ఉన్న తిరుపతమ్మకు సేవలు చేసిన పాపమాంబ, వంశీయులే నేటికీ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని సేవించి తరిస్తున్నారు.

క్షేత్రం చేరుకోవటానికి మార్గాలు...

పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం చేరుకునేందుకు విజయవాడ నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. పెనుగంచిప్రోలు నుంచి విజయవాడకు 60 కిలోమీటర్ల దూరం ఉంది. అలాగే పెనుగంచిప్రోలుకు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న జగ్గయ్యపేట, నందిగామ నుంచి కూడా ఆర్టీసీ బస్సులు, ఆటో సదుపాయం కలదు. ఖమ్మం, మధిర నుండి బస్సులు అందుబాటులో ఉన్నాయి.

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం జగ్గయ్యపేట సీనియర్ సివిల్ జడ్జి శ్రావణి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితు ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు జడ్జి శ్రావణిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.